# సైకాలజీ

**- వై. కె. మూర్తి**

**హో**టల్ మినర్వ అనెక్స్ ఫామిలీ రూంలో వెలుతురు సరిగా లేని చోట ఓ టేబుల్ ముందు ఎదురెదురుగా ఒకరినొకరు తదేకంగా, తమకంగా చూసుకుంటూ కూర్చుని ఉన్నారు శేఖర్, రజనీలు.

"చెప్పు రజనీ! నువ్వేం తీసుకుంటావ్"? ప్రేమగా అడిగాడు.

"నీ ఇష్టం నువ్వేం తీసుకుంటే నేనూ అదే తీసుకుంటాను" ముసిముసిగా నవ్వుతూ అంది రజని.

"నో...నో ....నా ఇష్టంకోసం నిన్ను బలవంత పెట్టలేను. చెప్పు నీకేం కావాలి"?

"సరే అయితే నాకు ఊతప్పం విత్‌మోర్ అనియన్స్ కోకనట్ చట్నీ, మరి నీకో?"

"నువ్వు ఊతప్పం తీసుకుంటే నేను దోశ తీసుకుంటానా? నాన్సెన్స్. నాకూ ఊతప్పమే.మరి హాట్ డ్రింక్స్? కాఫీ, టీ, బోర్నవిటా,హార్లిక్స్ కాంప్లాన్ ఏది కావాలి?"

"నా కవేం వద్దు. ఒక కప్పుపాలు చాలు. మరి నువ్వు?"

"నువ్వు పాలు తీసుకుంటే నేను టీ తీసుకుంటానా? నో...నో..నేనూ పాలే" ఇంతలో వెయిటర్‌రావడంతోరెండు ఊతప్పం, రెండు కప్పుల పాలు ఆర్డరిచ్చాడు శేఖర్.

★ ★ ★ ★

గుడిముందున్న పార్క్.

"దేవీ దర్శనం, దైవదర్శనం రెండూ అయ్యాయి. ఇప్పుడేంటి మన ప్రోగ్రాం సినిమానా? లేక సర్కస్సా?" రజని వళ్ళో తలొంచుకుని పడుకుంటూ ఆమె బుగ్గన చిటికేస్తూ అడిగాడు శేఖర్.

"నీ ఇష్టం" గోముగా అతని జుట్టు తన చేతి వేళ్ళతో సుతారంగా నిమురుతూ అంది రజని.

"నో...నో నాఇష్టానికి నీ ఇష్టం బలిపెట్టలేను డియర్, నీకేది ఇష్టం అయితే అదేనాకూనూ సో టెల్‌మీ"

"అలాగా! అయతే సినిమాదేముంది? ఈరోజు కాకపోతే రేపు చూడవచ్చు. కానీ బోంబే సర్కస్ ఇవాళే ఆఖరు. సర్కస్‌కే వెళదాం" శేఖర్ తన పట్ల చూపే ప్రేమకు తబ్బిబ్బైపోతూ అంది రజని.

"ఓకే మై స్వీట్ హార్ట్, లెటజ్‌గో!"

★ ★ ★ ★

అలా ప్రతి విషయంలోనూ ఆమె మాటకే విలువిచ్చి రజనిని ఆకట్టుకున్న శేఖర్ ఏడాది తిరిగే సరికి పెద్దల అంగీకారంతో పెళ్ళి చేసుకున్నాడు రజనీని.

ఆర్నెల్ల తరువాత ఓ రోజు!

హోటల్ మినర్వా ఫామిలీ రూంలో వెలుతురు బాగావున్న చోట ఓ టేబుల్‌ముందు కూర్చుని ఉన్నారు శేఖర్, రజని.

"వాట్‌కెన్ ఐసర్వ్ ఫర్‌యు సర్" వెయిటర్ వచ్చి వినయంగా అడిగాడు. అయితే ఇది వరకులా 'యుకెన్ కం ఆఫ్టర్ ఫైవ్‌మినిట్స్' అని గానీ

"నువ్వేం తీసుకుంటావ్?" అని రజనిని గాని అడగలేదుశేఖర్.

'రెండుప్లేట్ ఇడ్లీ, వీలైనంత సాంబార్, ప్లస్ రెండు టీ" అని ఆర్డరిచ్చేశాడు శేఖర్.

వెయిటర్ వెళ్ళిపోయాక కనీసం తనకేంకావాలో కూడా అడగకుండా ఆర్డరిచ్చేసిన శేఖర్ వంక ఆశ్చర్యంగా చూస్తూ -

'అదేమిటండీ మన పెళ్ళవకముందు ఎప్పుడు హోటల్‌కు వచ్చినా నా ఇష్టాన్ని తెలుసుకుని మరీ ఆర్డరిచ్చేవారు. ఇప్పుడేమో....?" అంది రజని.

"ఓసి పిచ్చిదానా!అప్పుడు నువ్వు నా ప్రియురాలివి. నిన్నేం అడక్కుండా నా అంతట నేనే నిరంకుశ తీర్మానాలు చేస్తే ఎక్కడ కాదంటావోనన్న భయం. ఇప్పుడు పెళ్ళయిందిగా, ఇంకెక్కడికి పోతావులే అన్న ధైర్యం అది మగవాడి సైకాలజీలే అన్న శేఖర్ వైపు ఆశ్చర్యంగా చూసింది రజని. ★